1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL/26/A2455

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక





Good for Health
Best for Readers
THE POWER OF RK PEN



సంపుటి : 01 సంచిక : 23    శనివారం 16 మే 2026 పేజీలు 8  వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.






# ఇకపై పుట్టపర్తి భక్తికే కాదు..
# దేశ భద్రతకు కూడా కేరాఫ్ అడ్రస్

- పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఆమ్కా) ప్రాజెక్టుకు శంకుస్థాపన
- భక్తి కేంద్రం ఇకపై దేశ భద్రతా కేంద్రంగా మారుతుందన్న సీఎం చంద్రబాబు
- రికార్డు సమయంలో ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని వెల్లడి
- రాయలసీమను రత్నాలసీమగా మార్చడమే లక్ష్యమని స్పష్టీకరణ
- రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు, ఉద్యోగ కల్పనే ధ్యేయమన్న ముఖ్యమంత్రి

(షణ్ముఖ వెలుగు, అనంతపురం,మే 15)

ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు నెలవైన పుట్టపర్తి గడ్డపై దేశ రక్షణ రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. దేశీయ పరిజ్ఞానంతో ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్లను తయారుచేసే ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ ప్రాజెక్టుతో పుట్టపర్తి ఇకపై భక్తికే కాకుండా దేశ భద్రతకు కూడా కీలక చిరునామాగా మారుతుందని సీఎం చంద్రబాబు అన్నారు.

### పుట్టపర్తిలో నూతన అధ్యాయం

పుట్టపర్తి ఇకపై ఆధ్యాత్మిక స్ఫూర్తి నుంచి వ్యూహాత్మక ఆవిష్కరణల కేంద్రంగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ఆంకా' ప్రాజెక్టు ద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య



సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామి అవుతుందని ఆయన తెలిపారు. ప్రాథమికంగా రూ.15,803 కోట్ల వ్యయంతో 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా తొలిదశలో 7,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు.

భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక యుద్ధ విమానాలను తయారు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

### జెట్ స్పీడ్‌తో అనుమతులు

ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసిన వేగాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనమని అన్నారు.

"ఈ ఏడాది 9వ తేదీన రక్షణ శాఖలో చర్చలు మొదలైతే, 20న ప్రతిపాదనలు అడిగారు. 24న మేం పంపాం, 28న కేంద్రం అంగీకరించింది. 29న అధికారులు స్థలాన్ని పరిశీలించి, 30న రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. జెట్ స్పీడ్‌తో ఫైటర్ జెట్ ప్రాజెక్టును సాధించాం" అని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు మంజూరులో కీలక పాత్ర పోషించిన ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ఏపీకి రక్షణ కవచం

'ఆమ్కా' ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ఇతర రక్షణ, అనుబంధ పరిశ్రమల గురించి కూడా సీఎం ప్రస్తావించారు. మడకశిరలో భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, దోనకొండలో బీడీఎల్ సంస్థలు రూ.2,959 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయని, దీనివల్ల 4-5 వేల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ద్వారా దేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకోసిస్టమ్‌కు శ్రీకారం చుట్టామని, రూ.686 కోట్ల పెట్టుబడులతో 8 సంస్థలు వస్తున్నాయని, తద్వారా 2,500 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

శ్రీహరికోట నుంచి అంతరిక్ష శక్తి, నాగాయలంక నుంచి క్షిపణి శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తి, ఇప్పుడు పుట్టపర్తి నుంచి వైమానిక శక్తితో ఆంధ్రప్రదేశ్ దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు.

### రత్నాల సీమగా రాయలసీమ

గతంలో కరవు సీమగా, రాళ్ల సీమగా పిలవబడిన రాయలసీమ రూపురేఖలు మారుస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "ఒకప్పుడు శ్రీకృష్ణదేవరాయల కాలంలో వీధుల్లో మిగతా 2లో

## అమెరికా పతనంలో ఉందన్న జిన్‌పింగ్.. అవునన్న ట్రంప్.. కానీ..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 15)



అమెరికా పతనం అంచున ఉందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. దీన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఏకీభవించారు. అయితే, అది మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో అంటూ విమర్శలు చేశారు. తన పరిపాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టు పెట్టారు. అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికాను క్షీణిస్తున్న దేశంగా మిగతా 2లో

## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ.. పవన్ కల్యాణ్ ప్రశంసలు



2

- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
- చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్
- పారిశ్రామికంగా ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య

## ఏపీ చీఫ్ సెక్రటరీ పదవీకాలం పొడిగింపు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 15)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి. సాయిప్రసాద్ సేవలను మరో ఆరు నెలల పాటు కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాస్తవానికి ఆయన ఈ నెల 31న పదవీ విరమణ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రత్యేక ప్రతిపాదనలను కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఆమోదించింది. ఈ పొడిగింపుతో ఆయన నవంబర్ 30 వరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా తన విధులను నిర్వర్తించనున్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈ సీనియర్ ఐఏఎస్ అధికారిపై రాష్ట్ర ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని ఈ నిర్ణయం బలపరుస్తోంది.రాష్ట్రంలో ప్రస్తుత పరిపాలనా పరిస్థితులు, కీలక ప్రాజెక్టుల కొనసాగింపు దృష్ట్యా సాయిప్రసాద్ అనుభవం అత్యవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారు. బడ్జెట్ రూపకల్పన, అమరావతి నిర్మాణ పనుల వేగవంతం ఇతర సంక్షేమ పథకాల అమలులో ఆయన కీలక భూమిక పోషిస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్ స్థాయిలో సమూల మార్పులు జరుగుతున్న తరుణంలో, అనుభవజ్ఞుడైన సీఎస్ మార్పు చెందడం పరిపాలనపై ప్రభావం చూపుతుందని ప్రభుత్వం భావించి ఈ పొడిగింపు కోరింది.

## భారత్ నే నమ్ముతున్న రష్యా.. పాకిస్థాన్‌ను నమ్మని పలు దేశాలు

### బ్రిక్స్ సమావేశంలో రష్యా విదేశాంగ మంత్రి సంచలన ప్రతిపాదన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 15)

న్యూఢిల్లీ వేదికగా జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కీలక ప్రతిపాదన చేశారు. అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడంలో భారతదేశం ఒక దీర్ఘకాలిక మధ్యవర్తి పాత్రను మిగతా 2లో

## ఆర్డీటీ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 15)

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) కేవలం ఓ సంస్థ మాత్రమే కాదని, అదొక ఉద్యమమని మంత్రి నారా లోకేశ్ ప్రస్తుతించారు. ఆర్డీటీ సేవలను చూశాక తమపై బాధ్యత పెరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా ఈ సంస్థ సేవల విస్తరణకు అండగా ఉంటామని పేర్కొన్నారు. గురువారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రిని మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సవితతో కలిసి పరిశీలించారు. అక్కడ ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ సమాధికి ఆయన భార్య అన్నే ఫెర్రర్, కుమారుడు, సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌తో కలిసి నివాళులర్పించారు. తర్వాత చిన్నపిల్లల వార్డుకు వెళ్లి రోగులతో మాట్లాడారు. అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. 'యువగళం పాదయాత్రలో ఆర్డీటీ గురించి తెలుసుకున్నా. దివ్యాంగ పిల్లల కోసం వారు నిర్వహిస్తున్న పాఠశాలను పరిశీలించాను. 57 ఏళ్లుగా ఫెర్రర్ కుటుంబ సేవలను చూశాను. పాఠశాలలు, ఆసుపత్రులు, మైదానాలు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి ఉదాత్తమైన సేవల గురించి తెలుసుకున్నాక మిగతా 2లో

## భోగాపురం ఎయిర్ పోర్టు పనులను తక్షణమే ఆపండి విష్ణుకుమార్ రాజు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 15)

రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన సంక్షోభం వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కొన్ని కీలక సూచనలు చేశారు. 2లో

## మొదటి పేజీ తరువాయి

## అమెరికా పతనంలో ఉందన్న జిన్‌పింగ్.. అవునన్న ట్రంప్.. కానీ..

అభివర్ణించారని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, నిద్రమత్తులో ఉండే జో బైడెన్ పరిపాలనను ఉద్దేశించి ఆయన ఆ వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ విషయంలో చైనా అధ్యక్షుడితో తాను 100% ఏకీభవిస్తానని తెలిపారు. బహిరంగ సరిహద్దులు, అధిక పన్నులు, దారుణమైన వాణిజ్య ఒప్పందాలు, పెరిగిన నేరాలతో సహా అనేక కారణాలతో అమెరికా అపారంగా నష్టపోయిందంటూ బైడెన్ పరిపాలనను విమర్శించారు. తన 16 నెలల అద్భుతమైన పదవీకాలంలో దేశం అసాధారణమైన పురోగతి సాధించిందని ట్రంప్ వెల్లడించారు. రికార్డ్ స్థాయి స్టాక్‌మార్కెట్లు, కొత్త పెట్టుబడి నిబద్ధతలు, వెనెజువెలాలో సైనిక విజయం, సైనిక చర్యతో ఇరాన్‌ను నాశనం చేయడం (ఇది ఇంకా కొనసాగుతోంది) వంటివి ఎన్నో జరిగాయన్నారు. నిజానికి ఇంత తక్కువ సమయంలో ఇన్ని అద్భుతమైన విజయాలు సాధించినందుకు జిన్‌పింగ్ తనను అభినందించాలని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా రెండేళ్ల క్రితం తమ దేశం నిజంగానే పతనం అంచున ఉందని ట్రంప్ తెలిపారు. కానీ, ఇప్పుడు అమెరికా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న దేశమని వెల్లడించారు. చైనాతో తమ సంబంధాలు గతంలో కంటే బలంగా, మెరుగ్గా ఉంటాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

## భోగాపురం ఎయిర్ పోర్టు పనులను తక్షణమే ఆపండి: విష్ణుకుమార్ రాజు

ప్రస్తుత ఇంధన సంక్షోభం పరిష్కారమయ్యే వరకు భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు. విమానాశ్రయం కంటే ప్రజల దైనందిన అవసరాలకు ఇంధనం అందుబాటులో ఉండటమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత కావాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే విశాఖపట్నం ఎయిర్‌పోర్టును యథాతథంగా కొనసాగించాలని, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. డీజిల్ డిమాండ్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఇంధన వినియోగాన్ని ఆదా చేసేందుకు డీజిల్ బస్సుల స్థానంలో పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజా రవాణాను బలోపేతం చేయడం ద్వారానే ఇంధన సంక్షోభాన్ని అధిగమించవచ్చని విష్ణుకుమార్ రాజు అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం నుంచి కీలక నగరాలైన విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, చెన్నైలకు కొత్తగా వందేభారత్ రైళ్లను వెంటనే ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. రైలు సర్వీసులను పెంచడం వల్ల వ్యక్తిగత వాహనాల వాడకం తగ్గి, ఇంధన భారం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఆర్డీటీ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి

వారికి అండగా నిలవడం కర్తవ్యంగా భావించాను' అని పేర్కొన్నారు. ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీకి అండగా నిలబడాలని కోరారు. ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ తర్వాత ఆర్డీటీ తమ సేవలను పూర్తిస్థాయిలో అందిస్తోందని పేర్కొన్నారు. తమకు ముందునుంచీ అండగా నిలుస్తున్న లోకేశ్.. ఈ రోజు ఆసుపత్రిని సందర్శించడం సంతోషంగా ఉందని మాంచో ఫెర్రర్ తెలిపారు. అంతకుముందు ధర్మవరం తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో లోకేశ్‌ను ఆహ్వానిస్తూ బత్తలపల్లి కూడలిలో తెదేపా శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి.

## భారత్ నే నమ్ముతున్న రష్యా.. పాకిస్థాన్‌ను నమ్మని పలు దేశాలు

పోషించగలదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తున్నప్పటికీ, అది ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. పాకిస్థాన్ కేవలం అమెరికా ప్రతిపాదనలను మాత్రమే తమ ముందు ఉంచుతోందని... తమ వాదనలను పట్టించుకోవడం లేదని ఇరాన్ ఇప్పటికే ఆరోపించింది. అంతేకాకుండా, ఇజ్రాయెల్, యూఏఈ వంటి దేశాలు కూడా పాక్ మధ్యవర్తిత్వాన్ని అనుమానిస్తున్నాయి. అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం వంటి వారు కూడా పాకిస్థాన్‌ను విశ్వసించలేమని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. "తాత్కాలికంగా పాకిస్థాన్ సహాయం చేయవచ్చు. కానీ సుదీర్ఘ దౌత్య అనుభవం, విశ్వసనీయత ఉన్న భారత్ మాత్రమే అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత పరిష్కారాన్ని తీసుకురాగలదు" అని లావ్రోవ్ స్పష్టం చేశారు. దీనికి ప్రధాన కారణం భారతదేశానికి అటు అమెరికాతోనూ, ఇటు ఇరాన్‌తోనూ ఉన్న బలమైన వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలే. రష్యా చేసిన ఈ ప్రతిపాదన పాకిస్థాన్‌కు దౌత్యపరంగా పెద్ద దెబ్బ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ తన సైనిక విమానాలను అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నుంచి రక్షించుకోవడానికి పాకిస్థాన్‌లోని 'నూర్ ఖాన్' ఎయిర్ బేస్‌ను వాడుకుంటోందని అమెరికన్ మీడియా కథనాలు వెలువరించడం కూడా పాకిస్థాన్ విశ్వసనీయతను దెబ్బతీసింది. ఇటువంటి పరిస్థితుల్లో ఒక తటస్థ, శక్తివంతమైన దేశంగా భారత్ పాత్ర కీలకం కానుంది.

## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ.. పవన్ కల్యాణ్ ప్రశంసలు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 15)**

ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో నిలిపే దిశగా రూ. 15,803 కోట్ల భారీ పెట్టుబడితో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ పారిశ్రామిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో ఏర్పాటు కాబోతున్న 'ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్' దేశ రక్షణలో కీలకం కానుంది. స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా' ప్రాజెక్టులో ఏపీ భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7,500 మంది యువతకు హై-వాల్యూ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేవలం విమానాల తయారీ మాత్రమే కాకుండా, రాష్ట్రంలో అత్యాధునిక 'డ్రోన్ ఎకోసిస్టమ్'ను అభివృద్ధి చేయడం ద్వారా డ్రోన్ టెక్నాలజీలో కూడా ఏపీ అగ్రగామిగా నిలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని పవన్ కొనియాడారు. ఈ భారీ ప్రాజెక్టు ఏపీకి రావడానికి సహకరించిన ప్రధాని మోదీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఇకపై పుట్టపర్తి భక్తికే కాదు.. దేశ భద్రతకు కూడా కేరాఫ్ అడ్రస్















రత్నాలు రాశులుగా పోసి అమ్మిన ఈ గడ్డను మళ్లీ రత్నాల సీమగా మార్చే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంది" అని ఆయన అన్నారు.

పెనుకొండలో కియా పరిశ్రమ విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, కరువు సీమలో తయారైన కార్లు నేడు 80 దేశాల్లో తిరుగుతున్నాయని గుర్తుచేశారు. కడప స్టీల్ ప్లాంట్‌ను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ (జీ+ఫీ) ద్వారా త్వరలో బంగారం ఉత్పత్తి ప్రారంభమవుతుందని, రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను కూడా తీసుకువస్తామని చెప్పారు.

### నీటిపారుదల, పరిశ్రమలతో దశ మార్పు

రాయలసీమ అభివృద్ధికి నీటిపారుదల ప్రాజెక్టులే పునాది అని చంద్రబాబు పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన హంద్రీనీవా, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. గొల్లపల్లి రిజర్వాయర్ వల్లే కియా మోటార్స్ రాగలిగిందని గుర్తుచేశారు.

సమర్థవంతమైన నీటి నిర్వహణతో నేడు మే నెలలో కూడా పుట్టపర్తి చెరువు నిండుగా ఉందని, ఇది సుపరిపాలనకు నిదర్శనమని అన్నారు. ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ స్టీల్, సిమెంట్ పరిశ్రమలను, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రోత్సహించి సీమ దశ మారుస్తామని భరోసా ఇచ్చారు.

### రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం

గత ఐదేళ్ల విధ్వంసకర పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలను తరిమేసి, క్రిమినల్ రాజకీయాలు చేశారని విమర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్ర పునర్నిర్మాణానికి హామీ ఇచ్చామని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రానికి మళ్లీ బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని చెప్పారు.

తమ ప్రభుత్వం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిందని, వీటి ద్వారా 24 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని ప్రకటించారు. రాష్ట్ర యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇక్కడే అవకాశాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.





### పొదుపు ఉద్యమానికి పిలుపు

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల (ఇరాన్-అమెరికా యుద్ధం) నేపథ్యంలో దేశ ఆర్థిక భద్రత కూడా ముఖ్యమని చంద్రబాబు అన్నారు. పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు, దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన ఏడు సూత్రాల పొదుపు మంత్రాన్ని పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

వర్క్ ఫ్రమ్ హోమ్, బంగారం కొనుగోళ్ల తగ్గింపు, ప్రజా రవాణా వినియోగం, వంట నూనెల వాడకం తగ్గింపు, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం వంటివి పాటించి దేశానికి అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం కూడా కాన్వాయ్‌లను తగ్గించడం వంటి చర్యలు చేపట్టిందని, ఈ పొదుపు ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.







ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు  తెలుగు దినపత్రిక

16.05.26 శనివారం


# రెండేళ్లలో రూ.1300 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ ఆసరా

- అద్దంకిలోనే 3వేల మందికి రూ.25.31 కోట్లకుపైగా లబ్ధి
- కూటమి హయాంలో 1.50 లక్షల ఒంటరి పెన్షన్లు
- పదో తరగతి ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు
- సోలార్ వంటి ప్రత్యామ్నాయాలను వినియోగించుకోవాలి
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 15)**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లకుపైగా కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా సుమారు రూ.1300 కోట్లను బాధితుల వైద్య సహాయం కోసం అందించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పర్యటించారు. సంతమాగులూరు మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. నాలుగు మండలాల నుంచి అత్యధిక మార్కులు పొందిన 20 మంది విద్యార్థులకు., ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందించారు. అనంతరం 84 మంది లబ్ధిదారులకు రూ.69,16,483., విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఎల్ఓసీలను అందించారు. సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏషియన్ హాస్పటల్స్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. సంతమాగులూరు మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించిన అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ పేదలను ఆదుకునే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ కు ఎక్కువ నిధులు కేటాయిస్తున్నారని వెల్లడించారు. అద్దంకి నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు 2,938 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.25.31 కోట్ల సహాయం అందిందని వివరించారు. అదే విధంగా ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అద్దంకి నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు 10,000పైగా సైకిళ్లను దాతల సహాయంతో ఉచితంగా అందించామని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా గుర్తు చేశారు. 210 మంది దివ్యాంగులకు కూడా ఉచిత ట్రై మోటార్ సైకిళ్లను ఇచ్చామని చెప్పారు. అదే విధంగా కూటమి ఏర్పడిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 లక్షల మందికి వితంతు, ఒంటరి పెన్షన్లను అందిస్తున్నామన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ ను పెంచామన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఏడాదికి సుమారు రూ.35,000 కోట్లు సంక్షేమ పెన్షన్ల కోసమే వెచ్చిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలలో 50 శాతం పెన్షన్లకు (తరువాయి 4లో...)





## అగ్నికి ఆహుతైన కావేరి ట్రావెల్స్ బస్సు

### డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణీకులు సురక్షితం

### పోలీసుల సమయస్ఫూర్తితో 38 మంది ప్రయాణికులు క్షేమం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 15)**

ఉలవపాడు చాగల్లు మధ్య కావేరి ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతయ్యింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. వివరాల్లోకి వెళితే ఉలవపాడు - చాగల్లు మధ్య జాతీయ రహదారి 16లో శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాదు నుండి తిరుపతి వెళుతున్న కావేరి ట్రావెల్ బస్సుకు ఉదయం సుమారు 3.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంబంధించింది. బస్సు వెనుక టైర్ వద్ద బేరింగ్ పట్టి వేయడంతో (తరువాయి 4లో...)

## ఎమ్మెల్యే ఏలూరి కృషితో 15 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల మంజూరు

- రూ.2.66 కోట్లతో నిర్మాణం
- ఎమ్మెల్యే ఏలూరి కృషితో
- పర్చూరు నియోజకవర్గానికి భారీ నిధులు
- మెరుగైన వైద్య సేవల కోసమే
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 15)**

పర్చూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన నిరంతర ప్రయత్నాలు ఫలించాయి. బాపట్ల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న 15 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు( ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల) నిర్మాణాలకు రూ.2.66 కోట్ల పరిపాలనా అనుమతి లభించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకం కింద గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు ఈ నిధులతో నూతన భవనాలను అందుబాటులో తీసుకురానున్నారు. పర్చూరు నియోజకవర్గానికి చెందిన పలు మండలాల్లో ఈ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో పలు మార్లు సమావేశమై పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య వసతులు కల్పించాలన్న లక్ష్యంతో ఆయన చేసిన కృషి

(తరువాయి 4లో...)

## నేడు నియోజకవర్గ స్థాయి పిజిఆర్ఎస్ హాజరుకానున్న ఎమ్మెల్యే కందుల, జిల్లా కలెక్టర్ విజయ సునీత




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 15)**

మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో మెగా గ్రీవెన్స్ కార్యక్రమం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మార్కాపురం పట్టణంలోని సప్తగిరి సెంటర్లోని శుభం ఫంక్షన్ హాల్ (పాత విశ్వేశ్వర థియేటర్) నందు నిర్వహించనున్నట్లు (తరువాయి 4లో...)

## మార్కాపురం బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా పివి కృష్ణారావు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 15)**



మార్కాపురం బిజెపి జిల్లా అధ్యక్షుడిగా పివి కృష్ణారావును నియమిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అధికారికంగా ప్రకటించారు. జిల్లా నుండి ఎంతో మంది జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీ చేసినప్పటికీ అధిష్టానం మాత్రం పివి కృష్ణారావుకే జిల్లా అధ్యక్ష పదవి ప్రకటించడంతో పలువురు బిజెపి నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. 1990 సంవత్సరం నుండి 95 సంవత్సరంలో ఏబీవీపీలో పనిచేసిన ఆయన 95 నుండి 2001 వరకు బిజెపి యువ మోర్చా పట్టణ అధ్యక్షునిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అదే విధంగా 2001 నుండి 2004 వరకు మార్కాపురం పట్టణ అధ్యక్షులుగా చేశారు. 2004 నుండి 2008 వరకు ప్రకాశం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 2008 నుంచి 2011 వరకు అసెంబ్లీ బిజెపి ఇన్చార్జిగా కొనసాగారు. 2014 నుండి 2018 వరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, 2018 నుండి 2026 వరకు అసెంబ్లీ ఇన్చార్జిగా కొనసాగుతూ గుర్తింపు పొందిన పివి కృష్ణారావుకు నేడు అధిష్టానం మార్కాపురం జిల్లా అధ్యక్షునిగా ప్రకటించడం హర్షనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు తనకు ఈ బాధ్యతను అప్పగించినందున బాధ్యతాయుతంగా జిల్లాలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీని మరింత (తరువాయి 4లో...)

# శభాష్ రాజాబాబు..!

### మరింత ఉత్సాహంతో పని చేయండి

### కలెక్టరుకు సీఎం చంద్రబాబు అభినందనలు





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 15)**

జిల్లాలో గ్రామస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ముఖ్యంగా కొత్త పట్నం మండలం గుండమాల గ్రామానికి స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు రావడంతో కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, కింది స్థాయి అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. శుక్రవారం రాత్రి అన్ని జిల్లాల కలెక్టర్ తో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుండమాల గ్రామానికి కేంద్ర ప్రభుత్వ అవార్డు రావడంతో ఇదే ఉత్సాహంతో మరింత దృష్టి పెట్టి ఇతర గ్రామాలను కూడా అభివృద్ధి బాట పట్టించాలని కలెక్టర్ కు ఆయన సూచించారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే ' స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ' కార్యక్రమంలో ఈ నెల 16వ తేదీన ' ప్లాస్టిక్ రహిత రాష్ట్రం ' అనే ఇతివృత్తంతో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపు ఇచ్చినందున ఇళ్ళు, పరిసరాల శుభ్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పి సీఈవో చిరంజీవి, డ్వామా పిడి జోసఫ్ కుమార్, డీఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో రూ.1300 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ ఆసరా

సంబంధించినవే అని వెల్లడించిన మంత్రి గొట్టిపాటి., ఆర్థిక వెసులుబాటు చూసుకుని కొత్త పెన్షన్లను అర్హులకు అందిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు అందరికీ అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులకు పథకాలు చేరువయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. అందరూ ఆ దిశగా పని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అద్దంకి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని స్పష్టం చేశారు. వ్యవసాయ సీజన్ కు ముందే సాగర్ కాలువ మరమత్తులు, పూడిక తీత పనులు పూర్తి చేసామని, రైతులకు సకాలంలో నీటిని అందిస్తామని ఆయన తెలిపారు. నాణ్యమైన విద్యుత్ నిరంతరాయ సరఫరా కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 20 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాళ్లను కూడా నిర్మాణం చేశామన్నారు. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వలన విదేశాల నుంచి గ్యాస్ దిగుమతి చేసుకోవడం కష్టంగా మారిందని మంత్రి గొట్టిపాటి వివరించారు. పెట్రోల్, డీజల్ వినియోగంపైనా యుద్ధ ప్రభావం ఉందన్నారు. ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై ప్రజలు కూడా దృష్టి సారించాలన్నారు. సీఎం చంద్రబాబు దూర దృష్టితో రాష్ట్రంలో సోలార్ వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యమంత్రి చొరవతోనే రాష్ట్రానికి 20 లక్షల సోలార్ కనెక్షన్లు మంజూరు అయ్యాయన్నారు. 2 కిలో వాట్ల వరకు ఎస్సీలకు పూర్తి ఉచితంగా రూఫ్ టాప్ సోలార్ యూనిట్లను అందిస్తున్నామన్నారు. మూడు కిలోవాట్లకు అయితే బీసీలకు రూ.98 వేలు., ఓసీలకు రూ.78 వేలు సబ్సిడీ ఉందన్నారు. రాష్ట్రంలో సోలార్ కనెక్షన్లు పెరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంకులతో పాటు సంబంధిత కాంట్రాక్టర్లతోనూ మాట్లాడి సోలార్ కనెక్షన్లు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. సోలార్ తో పగటి పూట విద్యుత్ ఉత్పత్తి చేసుకుని దానిని స్టోరేజ్ ద్వారా అవసరం అయినప్పుడు వినియోగించుకోవచ్చన్నారు. ప్రజలు కూడా సోలార్ వినియోగాన్ని పెంచాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు, జేసీ కల్పనా కుమారితో పాటు అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

**ఇంధన పొదుపుకు మంత్రి గొట్టిపాటి ముందడుగు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంధన పొదుపుపై ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తన కాన్వాయ్‌ను కుదించారు. ఎస్కార్ట్ వాహనాలతో పాటు కాన్వాయ్‌లో ఉపయోగించే ఇతర వాహనాలన్నింటినీ పక్కన పెట్టి, కేవలం ఒక్క వాహనంలోనే శుక్రవారం నియోజకవర్గ పర్యటన నిర్వహించారు. మంత్రి గొట్టిపాటితో పాటు సిబ్బంది కూడా అదే వాహనంలో ప్రయాణిస్తూ పర్యటన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ వ్యయ నియంత్రణతో పాటు ఇంధన పొదుపుకు ప్రాధాన్యత ఇస్తూ మంత్రి తీసుకున్న ఈ నిర్ణయం అధికార వర్గాల్లోనూ, ప్రజల్లోనూ ప్రశంసలు అందుకుంటోంది. ప్రజలకు ఆదర్శంగా నిలుస్తూ, ఇంధన వినియోగంలో మితవాదాన్ని పాటించాలని ప్రభుత్వం ఇచ్చే సందేశాన్ని మంత్రి తన ఆచరణ ద్వారా చాటిచెప్పారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒక్క వాహనంతోనే జిల్లా పర్యటన నిర్వహించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## కిశోరి వికాసం -బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది

ఐసిడిఎస్ సూపర్వైజర్ శివ నాగలక్ష్మి





(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, మే 15)

కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ శివ నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని ములకలూరు, ఉప్పలపాడు, తలార్లపల్లె గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శివ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచుకోవడానికి ఓ మంచి అవకాశం అని పేర్కొన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకునేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనట్లు వివరించారు. 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మహాలక్ష్మి, కుమారి, రమాదేవి అంగన్వాడీ కార్యకర్తలు పద్మావతి, రమాదేవి, దేవి, శారద, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్పి స్థలాల పై కబ్జా కోరలు అటువైపు చూడని అధికారులు!





(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, మే 15)

మండల కేంద్రమైన నూజెండ్లలో ఎన్ఎస్పి (నాగార్జున సాగర్ ప్రాజెక్ట్) భూములు కబ్జాకోరుల పాలవుతున్నా, సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూజెండ్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ భూములకు ప్రస్తుతం విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ సెంటు స్థలం విలువ సుమారు రూ.15 లక్షలకు పైగా పలుకుతుండటంతో, ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు రాజకీయ నాయకుల అండదండలతో యధేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారం మొత్తం అధికారులకు తెలిసినప్పటికీ, వారు కేవలం నోటీసులతోనే సరిపెడుతూ చేతులు దులుపుకోవడం గమనార్హం. ఆక్రమణలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నిస్తే, కోర్టు కేసులు, నిబంధనలు అడ్డువస్తున్నాయని పొంతన లేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ఇటీవలే కొందరు అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలన చేసినప్పటికీ, అది కేవలం తూతూమంత్రంగానే సాగింది తప్ప ఎటువంటి కఠిన చర్యలు తీసుకోలేదు. పైగా తమపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని వారు బహిరంగంగానే పేర్కొనడం విశేషం. ఈ ఉదాసీనత వెనుక భారీగా నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఇలాగే వ్యవహరిస్తే మిగిలిన ఖాళీ స్థలాలు కూడా కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అగ్నికి ఆహుతైన కావేరి ట్రావెల్స్ బస్సు





వెనుక భాగంలో మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తతమవడం జరిగింది. ఈ సంఘటన గమనించిన ఎస్ఈ పిఎల్ పెట్రోలింగ్ సిబ్బంది, రూట్ పెట్రోలింగ్ ఆఫీసర్ మిఖిల్ మనోజ్, డ్రైవర్ సాయి వెంటనే అప్రమత్తమై బస్సులో ఉన్న ప్రయాణకులను బయటకు తీసుకుని వచ్చారు. డ్రైవర్ అప్రమత్తత, పోలీసు వారి సమయస్ఫూర్తితో సుమారు 38 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటన స్థలానికి సిఐ అన్వర్ భాష, ఎస్ఐ జి సుబ్బారావు, రవాణా శాఖ అధికారి టివి నాగలక్ష్మి లు చేరుకుని సంఘటన ప్రాంతాన్ని, సంఘట జరిగిన తీరును పరిశీలించారు.

## పోలవరం నిర్వాసితులకు రూ.306 కోట్ల ప్యాకేజీ, ఇళ్ల తాళాలు అందించిన సీఎం చంద్రబాబు

**పోలవరంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని తెలిపిన సీఎం చంద్రబాబు**

**నిర్వాసితులకు నాలుగో విడతగా రూ.306 కోట్ల పరిహారం విడుదల**

**23 నెలల్లో నిర్వాసితులకు రూ.2,250 కోట్లు చెల్లించిన కూటమి ప్రభుత్వం**

**చంద్రబాబు సీఎం అయ్యాకే తమకు న్యాయం జరుగుతోందన్న నిర్వాసితులు**

**2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 15)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని, నిర్వాసితుల సంక్షేమం పట్ల ప్రత్యేక అభిమానంతో ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పుట్టపర్తి పర్యటన ముగించుకుని అమరావతి వచ్చిన ఆయన, శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు నాలుగో విడతగా రూ.306.61 కోట్ల పరిహారం, పునరావాస (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీని అందించారు. పలువురు లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్ల తాళాలను అందజేశారు.సర్ ఆర్థర్ కాటన్ జయంతి రోజున నిర్వాసితులకు పరిహారం అందించడం సంతోషంగా ఉందని సీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 నెలల్లో 29,936 మంది నిర్వాసితులకు సుమారు రూ.2,250 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. "ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు నష్టపోకూడదనేదే నా ఆలోచన. అందుకే ప్రత్యేకంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేశాం. 2027లో జరిగే పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వ నిర్వాకం వల్లే పోలవరం ప్రాజెక్టు ఆలస్యమైందని, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని ఆయన విమర్శించారు. "గత పాలకులు కాంట్రాక్టర్లను మార్చి, అధికారులను మార్చి ప్రాజెక్టును నాశనం చేశారు. మేం మళ్లీ ప్రాజెక్టును గాడిలో పెట్టాం. నిర్వాసితుల్లో ఒక్కరికి కూడా అన్యాయం జరగనివ్వను" అని భరోసా ఇచ్చారు. టెక్నాలజీని ఉపయోగించి గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ ఆదాయం పెంచుతామని, రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో మాట్లాడిన నిర్వాసితులు, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే తమ సమస్యల పరిష్కారంపై నమ్మకం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారంపై ఆశలు వదులుకున్నామని, వరదల సమయంలో కనీస సహాయం కూడా అందలేదని వారు ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే తమకు మంచి రోజులు వచ్చాయని, పండుగల సందర్భంగా సైతం పరిహారం అందిస్తుండటం సంతోషంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, మిరియాల శిరీషా దేవి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఏలూరి కృషితో 15 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల మంజూరు

ఫలితంగానే ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తయితే ప్రజలకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ నిధుల మంజూరుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు మరింత బలోపేతం అవుతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మండలాల వారీగా ఇలా......**

చినగంజాం మండలంలోని చిన్నగంజాం-1 రూ.9 లక్షలు, గోనసపూడి గ్రామానికి రూ.17 లక్షలు, కడవకుదురు-2 రూ.9 లక్షలు, కొత్తపాలెం-2 రూ.9 లక్షలు, మున్నంవారిపాలెం గ్రామానికి రూ.9 లక్షలు మంజూరయ్యాయి. ఇంకొల్లు మండలంలోని భీమవరం గ్రామానికి రూ.22 లక్షలు, నాగండ్ల గ్రామానికి రూ.22 లక్షలు మంజూరయ్యాయి. కారంచేడు మండలంలోని జరుబులవారిపాలెం గ్రామానికి రూ.24 లక్షలు కేటాయించారు. మార్టూరు మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి రూ.10 లక్షలు, దర్శి గ్రామానికి రూ.22 లక్షలు, రాజుగారిపాలెం గ్రామానికి రూ.21 లక్షలు మంజూరయ్యాయి. పర్చూరు మండలంలోని అడుసుమల్లి గ్రామానికి రూ.22 లక్షలు, తిమ్మరాజుపాలెం గ్రామానికి రూ.27 లక్షలు, ఉప్పుటూరు గ్రామానికి రూ.22 లక్షలు మంజూరయ్యాయి.

## నేడు నియోజకవర్గ స్థాయి పిజిఆర్ఎస్

**హాజరుకానున్న ఎమ్మెల్యే కందుల, జిల్లా కలెక్టర్ విజయ సునీత**

జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు హాజరుకానున్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. కావున మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు, రెండు మున్సిపాలిటీల ప్రజలు ప్రతి ఒక్కరూ ఏ సమస్య ఉన్న తమ సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కారం పొందగలరని తెలిపారు.

## మార్కాపురం బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా పివి కృష్ణారావు

ముందుకు తీసుకెళ్లే దిశగా పయనిస్తానని పివి కృష్ణారావు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర అధ్యక్షులు, ఇతర పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శాతరాజుపల్లి ప్రవీణ్, కె నాగరాజు, రామకృష్ణ, గుమ్మ రాఘవేంద్ర, జీవి రెడ్డి, బత్తుల పాలంకయ, పలువురు నాయకులు, కార్యకర్తలు కృష్ణారావుకు అభినందనలు తెలిపారు.

# ప్రతి ఇంటి వద్ద, రోడ్లు ప్రక్కన మొక్కలు నాటలి ప్రతి ఒక్కరు నీటిని కాపాడుకోవాలి



(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, మే 15)

జలధార – జలహారతి కార్యక్రమం ద్వారా జిల్లాలో మంచి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పంచాయతీ రాజ్ – గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జలధార –జలహారతి, నీటి సంరక్షణ 100 రోజుల కార్యక్రమంలో బాగంగా శుక్రవారం తనుబొద్ది వారి పాలెం నందు రూ.50 వేలతో నిర్మాణం చెప్పటే ఇంకుడు గుంతకు భూమి పూజ చేసి అనంతరం అనంతరం మునేంగివారిపాలెం గ్రామం నందు జలధార – జలహారతి కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన మంచి నీటి చెరువును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందు ఆలోచనతో రాబోయే తరాలకు నీటిని

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



అందించాలన్న ముఖ్య విద్దేశంతో రాష్ట్రంలో జలధార – జలహారతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జలధార – జలహారతి కార్యక్రమం ద్వారా మహిళలకు మంచి ఆదాయం వస్తోందని తెలిపారు. అందరు పెట్రోల్,డీజల్ ఆదాచేసినటుగానేని నీటిని కూడా ఆదచేయలన్నారు. ప్రతి గ్రామంలో నీరు ఉండేలా మనం ఆలోచన చేయాలన్నారు. గతం లో నీరు పుష్కలంగా ఉండేదని ప్రస్తుతం నీరు చాలా తగ్గుతుందని తెలిపారు. జలధార –జలహారతి కార్యక్రమంలో మీ గ్రామం నందు ఒక మంచి మోడల్ మంచి నీటి చెరువును నిర్మించుకున్నారని ఈ లాంటి మంచి నీటి చెరువును ప్రతి గ్రామమలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీ ఇంటి వద్ద నీరు వృధాగా పోకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు చూచించారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్ద మరియు గ్రామంలోని రోడ్లు ప్రక్కన మొక్కలను నాటి వాటిని సంరక్షణ చేయలన్నాను,మొక్కల నాటడంతో భూగర్భజలాలు పెంచుకోవచ్చునని తెలిపారు. మండలంలో ఎక్కువగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కలిగించాలని, మండల పరిధిలో ఉన్న మంచి నీటి చెరువులను పరిశుభ్రంగా చేసి గట్లు పై మొక్కలను నాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పంచాయతీ రాజ్ – గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జలధార –జలహారతి, నీటి సంరక్షణ 100 రోజుల కార్యక్రమంలో బాగంగా తనుబొద్ది వారి పాలెం నందు రూ.50 వేల తో నిర్మాణం చెప్పటే ఇంకుడు గుంతకు భూమి పూజ చేశారు, అనంతరం మునేంగివారిపాలెం గ్రామం నందు జలధార – జలహారతి కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన మంచి నీటి చెరువును పరిశీలించి చెరువు గట్టు పై కొబ్బరి మొక్కల ను జిల్లా కలెక్టర్ నాటారు. ఈ కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఎస్‌డిసి లవన్న, జిల్లా పంచాయతీ అధికారి యల్ ప్రభాకర్ రావు, డ్వామా పిడి విజయలక్ష్మి, జలవనరులశాఖ ఎస్‌ఈ గోపినాద్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, తహశీల్దార్, యంపిడిఓ, పంచాయతీ సెక్రటరీ, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.





# ప్రాపర్టీ షోను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

ఒంగోలులోని ఏ వన్ కన్వెన్షన్ హాలులో ప్రాపర్టీ షోను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ సుచిత్ర వీరయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ బైలా ప్రకారం నిర్మాణ సంస్థలు ఇంటి నిర్మాణాలను అన్ని అనుమతులు తీసుకొని నిర్మించాలన్నారు. ఇల్లు కొనుగోలు చేసిన ప్రజలు ఇబ్బందులు పాలు కాకుండా అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని హితవు పలికారు. కాంట్రాక్టర్ మంచి క్వాలిటీతో అన్ని అనుమతిలతో ఇంటి నిర్మాణాలు చేస్తే, ధరలు కూడా అదే స్థాయిలో బాగా వస్తాయని పేర్కొన్నారు. క్రడాయి ఒంగోలుకు తమ వంతు సహకారం పూర్తిగా ఉంటుందని హామీ ఇచ్చారు. త్వరలో ఒంగోలుకు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామని, అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ ఒంగోలులో స్థలాల ధరలు హైదరాబాదు నుంచి చెప్తున్నారని అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని మంగమూరు డొంక మరో గచ్చిబౌలి లాంటిదని అన్నారు. బిల్డర్లు అన్ని అనుమతులు పొందిన తర్వాతే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని హితవు పలికారు. సంతనూతలపాడు నియోజకవర్గం పరిధిలో భూములు కొనుగోలు చేస్తే భూముల ధరలు వేగంగా పెరుగుతాయని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించండి

## పీఎంశ్రీ జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి

## 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పై ప్రత్యేక శిక్షణ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 15)

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కనిగిరి పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలవ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి క్యాంపెయిన్ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కూడా కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు ఉన్నాయని, పాఠశాలలో స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు నిర్వహిస్తున్నామని, 2025 - 26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 25 మంది పైగా 500 మార్కులు పైగా సాధించారని, అలాగే అనేక పోటీ పరీక్షలలో నియోజకవర్గస్థాయిలోను, జిల్లాస్థాయిలోను మా పాఠశాల విద్యార్థులు విజేతలయ్యారని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్యానెల్స్ ద్వారా విద్యార్థులకు బోధించడం జరుగుతుందని ఆమె అన్నారు. మా పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థినిలు ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో టౌన్ టాప్‌గా నిలిచారని ఆమె అన్నారు. ప్రతి సంవత్సరం 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కొరకు విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులలో ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యా బోధనపై, విద్యార్థులకు అందజేస్తున్న ప్రభుత్వ పథకాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనురాధ, అలివేలమ్మ, నాగమణి, వై శ్రీనివాసులు, ఏవి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం-రాహత్' వరం

## రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం

## గోల్డెన్ అవర్‌లో ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం అందిస్తే ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు

## సహాయం చేసిన 'రహ-వీర్'లకు రూ.25,000 నగదు బహుమతి అందజేస్తారు

## ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 15)

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "పీఎం-రాహత్ పథకం అత్యంత ఉపయోగకరమైనదని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు భద్రత విషయంలో జిల్లా వ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం ద్వారా నివారణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

రాహత్ పథకం కింద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రమాదం జరిగిన వెంటనే సమీప ఆసుపత్రిలో చేర్పించి, మొదటి ల48 నుండి 72 గంటల 'గోల్డెన్ అవర్' లో రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందించబడుతుందని తెలిపారు. డబ్బులు లేకపోవడం వల్ల ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదనే లక్ష్యంతో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని, ముఖ్యంగా తీవ్ర గాయాలు పొందిన బాధితులకు ఇది ప్రాణరక్షకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేస్తూ, రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే "గుడ్ సమారిటన్"లకు చట్టపరమైన రక్షణ కల్పించబడిందని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగవని స్పష్టం చేశారు.

"గుడ్ సమారిటన్" కాన్సెప్ట్‌ను ప్రోత్సహించే భాగంగా, రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్పించి ప్రాణాలను కాపాడేందుకు సహాయం చేసే వారికి రూ.25,000 నగదు పురస్కారం అందజేయబడుతుందని తెలిపారు. ప్రాణాలను కాపాడటం మనందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. అలాగే జిల్లాలో ప్రజలు ముందుకు వచ్చి ప్రమాదాలపై వెంటనే స్పందించి, బాధితులకు అత్యవసర సహాయం అందించాలని పిలుపునిచ్చారు.



# లైంగిక పునరుత్పత్తి ఆరోగ్యం, హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన

## స్పెషల్ ఆఫీసర్ ఈవీ రంగయ్య

(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, మే 15)

మర్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం సచివాలయం పరిధిలోని రాగలగడ్డలో గురువారం కిశోరి వికాసంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఈవీ రంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ 15 సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలికలకు అవగాహన కల్పించడంలో ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆనాటి లైంగిక పునరుత్పత్తి ఆరోగ్యం మరియు హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రధానంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి బివి నాయుడు, మాజీ సర్పంచ్ గురిజాల నాగయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, అంగన్వాడి కార్యకర్తలు వెంకట నరసమ్మ, ఎస్తేరు రాణి, కోరికమ్మ, వెంకట రమణ, శ్రీలక్ష్మి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# క్విస్ ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ వివిధ క్యాంపుల్లో ఉత్తమ ప్రదర్శన

### ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ సీసీ క్యాడెట్లు వివిధ అంశాల్లో తమ సత్తాచాటారు. నేషనల్ లెవెల్ క్యాంపుల్లో పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. కోయంబత్తూర్ లోని నీళగిరి హిల్స్ లో నిర్వహించిన ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్ లో బీటెక్ మొదటి ఏడాది చదువుతున్న యం. సాయిలక్ష్మి పాల్గొని ఆంధ్రరాష్ట్రానికి సీనియర్ గా వ్యవహరించింది. వారం రోజుల పాటు జరిగిన ఈ క్యాంప్ లో ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్ అందుకుంది. గుంటూరులో జరిగిన ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ సెలక్షన్ క్యాంప్ - 1లో క్విస్ కాలేజికి చెందిన ఎస్ .వెంకటేశ్, ఓం సాయి తేజ, కీర్తన షూటింగ్ లో సత్తాచాటారు. వివిధ లెవెల్స్ లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి సెకెండ్ లెవెల్ కి అర్హత సాధించారు. అంతేకాకుండా మార్కాపురంలో జరిగిన యాన్యువల్ క్యాంప్ లో పాల్గొన్న ఏడుగురు ఎన్ సీసీ క్యాడెట్లు వివిధ అంశాలపై అవగాహన పెంచుకుని దానికి సంబంధించి సర్టిఫికెట్లు సాధించారు. ప్రతిభ కనబరిచిన ఎన్ సీసీ క్యాడెట్లను విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి అభినందించారు. ఎన్ ఎసీసీ అంటే క్రమశిక్షణకు మారుపేరు అని ఆయన అన్నారు. దేశానికి సేవచేయాలనే ఆలోచనతో, లక్ష్యంతో ఎన్ సీసీ లో చేరిన విద్యార్థులను చూస్తే ఎంతో ఆనందంగా ఉందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ నెల 22 నుంచి 31 వరకు క్విస్ కళాశాలలో ఏటీసీ - 14 క్యాంప్ వారం రోజుల పాటు జరగనుందని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎన్ సీసీ క్యాడెట్లు ఇక్కడ శిక్షణ పొందనున్నట్లు సూర్య కల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. అంత గొప్ప క్యాంప్ ఇక్కడ నిర్వహించడం తమకు గర్వకారణం అని ఆయన చెప్పారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి హనుమంతరావు, స్టూడెంట్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ వాసుబాబు, ఎన్ సీసీ కేర్ టేకర్ శ్రీ నిలయ్, తదితరులు పాల్గొన్నారు.

# పిఓడబ్ల్యు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

శ్రామిక వర్గ మహిళల విముక్తే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలు 2026 మే 23, 24 తేదీల్లో గుంటూరు నగరంలో జరుగుతున్నాయని, ఆ సభలను జయప్రదం చేయాలని, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవనంలో మహాసభల గోడపత్రిక ఆవిష్కరణలో ఆమె మాట్లాడుతూ స్త్రీ పురుష సమానాత్వానికై, మహిళలకు ఉపాధి భద్రత, ఆహార భద్రత, నివాస హక్కుల కోసం గత 50 ఏళ్లుగా పోరాడుతుందన్నారు. భారతదేశంలో స్త్రీ ను భారత మాతగా ఒక వైపు చూస్తూ, మరోవైపు స్త్రీని సమానత్వంగా చూడకుండా అడుగడుగునా అగౌరవ పరుస్తున్నారన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు చేస్తున్నప్పటికీ, అవి అమలు చేయటంలో నిష్పక్షపాత వైఖరి ఆవలం బిస్తున్నారన్నారు. నిత్యం ఏదో ఒక చోట మహిళల మీద లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. కనుక గుంటూరులో జరుగుతున్న ఈ రాష్ట్ర మహాసభలలో మహిళల రాజకీయ, ఆర్థిక అంశాలను చర్చించి భవిష్యత్తు పోరాటాన్ని రూపొందిస్తామని పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్ భారతి, జిల్లా కార్యదర్శి వి మంజుల, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, జిల్లా సహా కార్యదర్శి సుశీల, జిల్లా నాయకురాలు అమ్మాజీ, సిహెచ్ సంపూర్ణ, రచన, అన్విత, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రాధాన్యత

## రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్







(షణ్ముఖ వెలుగు, సంతమాగులూరు, మే 15)

ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సంతమాగులూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన నియోజక వర్గ ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించడంతో పాటు వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమమునకు సంబంధించి జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజికవర్గములో ప్రతి శుక్రవారం రోజు " 1 నియోజకవర్గము, 4 పర్యటనలు" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం అద్దంకి నియోజకవర్గ పరిధిలోని సంతమాగులూరు మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఈ రోజు వచ్చిన అర్జీలలో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలపై మరియు కొత్త పెన్షన్లు మంజూరు కు సంబంధించి రావడం జరిగిందని, ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో పెద్ద మొత్తంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో ఒక్క అద్దంకి నియోజక వర్గంలో షుమారు మూడు వేల మందికి 25 కోట్ల రూపాయలు మేర సిఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సహాయం అంద చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే ఇటీవల 10వ తరగతి పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో సన్మానించడం జరిగిందన్నారు. సిఎస్ఆర్ నిధులతో నియోజక వర్గంలో 20 కమ్యూనిటీ హాల్స్ నిర్మించడం జరిగిందని, మరో 12 కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. నాగార్జున సాగర్ కెనాల్ కు నీటిని వదలకు ముందే అన్నీ కాలువల్లో పూడికతీత, క్లియరెన్స్ పనులు చేపట్టడం జరుగుచున్నదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సర కాలంలో జిల్లాలో పెద్ద ఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

నేడు ప్రపంచంలో నెలకొని ఉన్న పరిస్థితుల్లో సోలార్ విద్యుత్ ను మరింత ప్రోత్సహిస్తూ సూర్య ఘర్ పథకం కింద రాయితీతో సోలార్ ప్యానెల్స్ ను ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ రోజు వచ్చిన అర్జీల్లో ఎక్కువ శాతం పెన్షన్ల పై రావడం జరిగిందని, కొత్త పెన్షన్ల మంజూరుకు ముఖ్యమంత్రి గారు త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో ఎన్నో కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా అలాగే ఆన్ లైన్ ద్వారా ప్రజల నుండి వినతులను స్వీకరించడం జరుగుచున్నదన్నారు. ఆర్జీలను స్వీకరించడంతో పాటు సంబంధిత అర్జీదారులు సంతృప్తి స్థాయి పెరిగేలా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుచున్నదన్నారు. అయినప్పటికినీ మరింతగా ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా ప్రతి శుక్రవారం ఒక నియోజక వర్గం, నాలుగు పర్యటనలు అనే వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు శ్రీ కారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం కింద ఒక నియోజక వర్గంలో నాలుగు సార్లు పర్యటించి వచ్చిన సమస్యలపై దృష్టి సారించినట్లయితే ఆ సమస్యలు పరిష్కరించబడునన్న ఉద్దేశ్యం తో ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం జరుగుచున్నదన్నారు. ఈ కార్యక్రమం కింద వచ్చిన అర్జీ వంద శాతం పరిష్కారం కావాలి అనే లక్ష్యంతో పనిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు సుమారు 204 అర్జీలు రావడం జరిగిందని, అందులో 68 అర్జీలు రెవెన్యూ సమస్యలపై, మరో 44 అర్జీలు పెన్షన్లు కోసం రావడం జరిగిందన్నారు. ఫైనాన్స్ కు సంబంధం లేని రెవెన్యూ సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించడంతో పాటు పరిష్కారం అయినట్లుగా లెటర్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఏదైనా రెవెన్యూ సమస్య కు సంబంధించి నిర్ణీత గడువులోపు పరిష్కారం కాని పక్షంలో ఆ విషయాన్ని కూడా సంబంధిత అర్జీదారునికి తెల్పడం జరుగుతుందని కలెక్టరు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జవాబుదారీతనంతో ప్రజా సమస్యల పరిష్కారికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున, అధికారులు కూడా ప్రజా సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులకు సూచించారు. ప్రజల సంతృప్తి స్థాయిని పెంచే విధంగా, వారి యొక్క సమస్యను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని కలెక్టర్ తెలిపారు. ఈ రోజు పల్లె నిద్ర కార్యక్రమం కింద ఇదే మండలంలోని సజ్జాపురం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందని కలెక్టరు తెలిపారు. జిల్లా యంత్రాంగం ప్రజల ముంగిట కే వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందున ప్రజలు కూడా తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత అద్దంకి నియోజక వర్గ పరిధిలోని అద్దంకి అర్బన్ తో పాటు 5 మండలాల్లో ఇటీవల వెలువడిన 10వ తరగతి పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ప్రతి మండలంలోని మొదటి 5 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను 10 వేల రూపాయల నగదుతో శాలువ కప్పి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సన్మానించారు. తరువాత అద్దంకి నియోజక వర్గ పరిధిలోని 5మండలాలకు చెందిన 84 మంది లబ్ధదారులకు 69 లక్షల 16 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్‌రెడ్డి, అద్దంకి ఆర్డీఓ జాన్సన్, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వేంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజీవేముల స్వాతి జ్ఞాపకార్థం పలువురికి మజ్జిగ వితరణ

## జీవేముల స్వాతి సేవలు మరువలేనివి

### ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ డైరెక్టర్ కెవి సుబ్బారావు






(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 15)

మంచితనానికి మారుపేరుగా నిలిచి, అకాల మరణం చెందిన బిజీవేముల స్వాతి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ.. ఆమె జ్ఞాపకార్థం శుక్రవారం బద్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ వితరణ కార్యక్రమం ఎందరో పాదాచార్యుల దాహార్తిని తీర్చింది.వేసవి తీవ్రతను, భానుడి భగభగలను దృష్టిలో ఉంచుకుని స్వాతి కుటుంబ సభ్యులు, రవీంద్రారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో మైదుకూరు రోడ్డులోని అన్నా క్యాంటీన్ వద్ద ఉన్న మంచినీటి చలివేంద్రం ప్రాంగణంలో ఈ సేవా కార్యక్రమాన్ని అత్యంత శ్రద్ధతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 400 మందికి పైగా బాటసారులకు, ప్రయాణికులకు చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ స్టేట్ డైరెక్టర్ కె వి సుబ్బారావు, పోకల సుబ్బారెడ్డి, ప్రముఖ విద్యావేత్త సి.వి. నాగేశ్వరరావు, రామకోటి రాజు, నేలపాటి వెంకటసుబ్బయ్యతో పాటు పలువురు ముఖ్య నాయకులు, ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై, తమ చేతుల మీదుగా మజ్జిగను వితరణ చేశారు.



**నిరంతరం సాగే స్మరణ సేవా యజ్ఞం:** సమాజంలో ఎంతో సద్గుణశీలిగా పేరు తెచ్చుకున్న బిజీవేముల స్వాతి భౌతికంగా మనకు దూరమైనా, ఆమె జ్ఞాపకాలు సజీవంగా ఉంచేలా వారి కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం ఈ మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తుండటం గమనార్హం. ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ చల్లటి మజ్జిగ ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిందని, స్వాతి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ఆమె కుటుంబ సభ్యులు చేస్తున్న ఈ సేవా కార్యక్రమం అందరికీ ఆదర్శనీయమని విద్యావేత్త సి.వి. నాగేశ్వరరావు మరియు ఇతర ప్రముఖులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కుటుంబ శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# వర్క్ అవుట్సోర్సింగ్, ప్రైవేట్ వాహనాలను వ్యతిరేకిస్తూ కార్మికుల నిరసన



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 15)

వర్క్ అవుట్సోర్సింగ్, ప్రైవేట్ వాహనాలను వ్యతిరేకిస్తూ కార్మికుల నిరసన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆధీనంలోని నీతి ఆయోగి చెప్పిన ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలలో వర్క్ అవుట్సోర్సింగ్ మరియు ప్రైవేట్ వాహనాల అనుమతికి నిరసనగా స్థానిక నగర పంచాయతీలో కార్మికుల నిరసన తెలిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నగర పంచాయతీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి కోటేశ్వరరావు మాట్లాడుతూ వర్క్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో ప్రైవేటు వాహన కాంట్రాక్టర్లు రంగంలోకి వస్తే ఇప్పటివరకు మున్సిపాలిటీలు నగర పంచాయతీల విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్ లకు భవిష్యత్తులో క్లబ్ డ్రైవర్లకు పట్టిన గతి పడుతుందన్నారు. దీంతో మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలు రోజు రోజుకు పర్మినెంట్ చేయకుండా శాశ్వతంగా బానిసల్లాగా పని చేయాల్సి వస్తుందన్నారు. ఈ వర్క్ ఔట్సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికులు కెవి నరసింహం, నాగేశ్వరరావు, ప్రభావతి, కోటేశ్వరమ్మ, నాగేంద్రమ్మ, హనుమంతరావు, సిహెచ్ వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, సిహెచ్ రామయ్య, సిహెచ్ రామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి తండ్రి, కుమారుడు కృషి అనన్యం

**రెండేళ్లలో 88 శాతం సుపరిపాలనందించి అందరిమన్ననలను పొందుతున్న కూటమి ప్రభుత్వం**
**చంద్రబాబు నాయుడు రైతుపక్షపాతి**
**రైతులను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**
**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**
**ఎమ్మెల్యే కందులనారాయణరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన యువ నాయకులు**








**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 15)**
రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారాలోకేష్‌లు ప్రజల అభ్యున్నతి కోసం దేశ విదేశాలలో పర్యటించి అనేక రకాల పరిశ్రమలు తెచ్చేందుకు వారు అహర్నిశలు కృషి చేయడం అనన్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పరిశ్రమలతో ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి లభిస్తుందన్నారు. ఈ విధంగా చేసి నిరుద్యోగ సమస్యలు తీర్చేందుకు తమ వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని, పార్టీలకు అతీతంగా రెండేళ్ల వారి సుపరిపాలనలో 88% అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, రైతు పక్షపాతి అయిన చంద్రబాబు నాయుడు రైతులను అన్ని విధాలుగా ఆదుకొని వారిని కోటీశ్వరులుగా చేయాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. మండలంలోని సీతా నాగులవరం గ్రామంలో టిడిపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఎలక్ట్రికల్ ప్రభను అంగరంగ వైభవంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత అండ అని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు కావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రజానీకం దౌర్జన్యాలకు, దోపిడీలకు, కక్షలకు, కార్పన్యాలకు గురై ఎలాంటి అభివృద్ధి లేకుండా రాష్ట్రం రావణ కాష్టంగా మార్చారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట తప్పడు మడమ తిప్పడు అన్న సామెతకు అనుగుణంగా మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాడన్నారు, దీంతో అనేక విధాలైన అధికారుల బృందం, ప్రభుత్వ కార్యాలయాలు, మెడికల్ కాలేజీలు, జిల్లా కేంద్రంలోనే ఉంటారన్నారు. అంతే కాక వివిధ రకాల పరిశ్రమలు వస్తాయని, వాటితో ఎంతో మందికి ఉపాధి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయి అన్నారు. రెండవది వెలుగొండ ప్రాజెక్టు వచ్చే నాలుగు, ఐదు నెలలలో పూర్తి చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు గుండా 15 లక్షల మందికి త్రాగునీరు, సుమారు ఐదు లక్షల ఎకరాల భూములకు సాగు నీరు అందించడంతో అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. దీంతో ఈ ప్రాంత రైతాంగం అంతా కోటీశ్వరులు అవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్క సారి కుటుంబ సభ్యులందరూ కూర్చొని ఏ ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి, ఏ ప్రభుత్వాలు ఉపయోగపడటం లేదో అంతే కాక ఏ నాయకుల పని తీరు ఎలా ఉందో చర్చించుకోవాల్సిన ఆవశ్యకత మీ పై ఉందన్నారు. భవిష్యత్తులో కూడా మీ అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడే నాయకులకు మీ ఆశీర్వాదాలు ఎల్లవేళలా ఉన్నట్లయితే మార్కాపురం జిల్లాను అభివృద్ధి చెందిన జిల్లాలతో దీటుగా అభివృద్ధి చేసేందుకు నా వంతు శక్తివంతం లేకుండా కృషి చేస్తానన్నారు. మరల మునుపటి మాదిరిగానే వైయస్సార్ ప్రభుత్వానికి చరమగీతం పాడి టిడిపి ప్రభుత్వానికి పూర్వ వైభవాన్ని ఎలా తెచ్చారో అదే విధంగా మరల ఏ మాత్రం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చనూతల గోపీనాద్ చౌదరి, మార్కాపురం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున్, మార్కాపురం జిల్లా బిజెపి అధ్యక్షులు పివి కృష్ణారావు, ఇబ్రహీం, తర్లుపాడు







మండల టిడిపి కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి, చిరంజీవి, ఈర్ల వెంకటయ్య, గోసు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కందులనారాయణరెడ్డి విధి విధానాలు నచ్చి ఆయన సమక్షంలో ముందుగా సీతానాగులవరం గ్రామానికి చెందిన ఇరువురు యువ నాయకులు వెంకటరామయ్య, నాగేళ్ల ఆంజనేయులు తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తిరుణాల సందర్భంగా మూడు రోజులు పాటు నిర్వహించిన వివిధ వినోద కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వెన్నూరులో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపు

**బంగారు బాల్యం పై**
**అవగాహన సదస్సులు**
**సూపర్వైజర్ విక్టోరియా రాణి**





**(షణ్ముఖ వెలుగు, కొండపి, మే 15)**
కిషోర్ వికాసం సమ్మర్ క్యాంపు, బంగారు బాల్యంలో భాగంగా వెన్నూరు హై స్కూల్ నందు అవసరాలు ఎదుర్కొనే అనే అంశం పైన సూపర్వైజర్ విక్టోరియా రాణి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర్ బాలికల యొక్క అవసరాలు గుర్తించాలని, విద్య చక్కగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని, మంచి ఆహారం పూర్తిగా తీసుకొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, నాయకత్వ లక్షణాలు పెంపొందించబడాలన్నారు. వారి జీవితంలో ఎదురయ్యేటువంటి సమస్యలను కుటుంబం సమాజంలోని నమ్మకమైన వ్యక్తులు ద్వారా వాటిని పరిష్కరించుకోవాలన్నారు. పరస్పర సహకారంతో ముందుకు కొనసాగాలని తెలియజేశారు. ఏదైనా అనుకోనని సమస్య ఎదురైతే వెంటనే స్పందించి కుటుంబ పెద్దలతోటి చర్చించి వాటిని పరిష్కరించుకోవాలని చెప్పారు. ఏఎన్ఎం శ్రీవేణి హెచ్ఐవి పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, బాలికలు, తల్లులు, స్కూల్ టీచర్ రేఖ, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

# కంపు కొడుతున్న ఇందిరా కాలనీ.. పట్టించుకోని సచివాలయ ఉద్యోగులు





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 15)**
కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా కాలనీలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతుంది, ప్రధాన రహదారి అయిన ఇందిరా కాలనీ పగ్గాల వెంకటయ్య ఇంటి వద్ద డ్రైనేజ్ కాలువ లో చెత్త పేరఖ పోయింది దీంతో ఆ ప్రాంతంలో డ్రైనేజ్ నీటితో కంపు కొడుతుంది, అలానే వార్డు శానిటేషన్ అధికారులు మా వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం, సాయి నగర్ పరిస్థితి కూడా ఇలానే ఉంది, డ్రైనేజ్ కాలువలు మట్టి తీయక పోవడంతో దుర్వాసన వస్తుంది, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజల కోరుతున్నారు.







# ఆర్‌టిసి ఉద్యోగులకు గుండె జబ్బుల నివారణ పై అవగాహన

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 15)**
ఆర్‌టిసి ఉద్యోగుల ఆరోగ్య భద్రతపై రాష్ట్ర ఉన్నతాధికారులు, మార్కాపురం జిల్లా డి పి టి ఓ సత్యనారాయణ ఆదేశాల మేరకు శుక్రవారం కనిగిరి డిపోలో డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఒంగోలు ప్రాంతీయ ఆర్‌టిసి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె శివ నాగరాజు మాట్లాడుతూ ఇటీవల సంస్థలో గుండె జబ్బుల కారణంగా మరణాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. గుండె జబ్బులు రాకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమయానికి నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. జంక్ ఫుడ్, మద్యం, గుట్కా, పాన్ పరాగ్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విధుల్లో ఒత్తిడి ఎక్కువగా ఉండే ఉద్యోగులు తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఆర్‌టిసి ఎండీ ఆదేశాల మేరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ సంస్థ ప్రాధాన్యతల్లో ఒకటని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు ఆరోగ్య నియమాలు కూడా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



## విజయవంతంగా ముగిసిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్





**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 15)**

శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో బిఐఎస్ఏఎఫ్ఈ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా ముగిసిందని కళాశాల పరిపాలన అధికారి రాచపూడి సాయి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి బిఐఎస్ఏఎఫ్ఈ ఇండస్ట్రీస్ ప్రాంతీయ మేనేజర్ కె కనకరాజు నాయకత్వంలో నిర్వహించారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్, టయోటా, విప్రో-పారి, ఐటీసీ, బీఎండబ్ల్యూ కార్ మాన్యుఫాక్చరింగ్ వంటి ప్రముఖ సంస్థలలో ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఎస్ఎల్‌సి, పియుసి, ఐటిఐ డిప్లొమా, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొన్నారు. మొత్తం 33 మంది అభ్యర్థులు వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకాగా, 30 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించబడింది. అందులో 28 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. అదనంగా ఇద్దరు అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన వేతనాలతో పాటు ఉచిత వసతి, భోజనం, రవాణా, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇలాంటి ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బిఐఎస్ఏఎఫ్ఈ ఇండస్ట్రీస్ ప్రతినిధులకు కళాశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ అశోక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాల ఓబులేసు, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షాహిన, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ గంగరాజు, పలువురు పాల్గొన్నారు.

## ప్రతి వినతి పత్రాన్ని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలి

### వైపాలెం టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు





**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మే 15)**

యర్రగొండపాలెం పట్టణంలోని మండల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించగా, వాటిని స్వయంగా పరిశీలించిన ఎరిక్షన్ బాబు తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వినతులపై కూడా వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను సూచించారు. ప్రతి వినతి పత్రాన్ని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళ రెడ్డి, మండల అధ్యక్షులు పొట్ల గోవిందు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీ ముమ్మరం
# నేరాల పై కట్టడి

### అనుమానితులపై ప్రత్యేక నిఘా
### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్న ప్రకాశం జిల్లా పోలీసులు
### ప్రకాశం, మార్కాపురం జిల్లాల వ్యాప్తంగా వాహన తనిఖీలు
### 236 వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్కాపురం, మే 15)**

ప్రకాశం, మార్కాపురం జిల్లాల వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ప్రత్యేకంగా వాహన తనిఖీలను కూడా నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రాత్రి సమయంలో అనవసరంగా మరియు అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలను పోలీసులు తనిఖీ చేసి, వాటి రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర రికార్డులను పరిశీలించారు. సరైన పత్రాలు లేని లేదా రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై చర్యలు చేపట్టారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా మొత్తం 780 వాహనాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని 103 వాహనాలను స్వాధీనం చేసుకొని సంబంధిత పోలీసు స్టేషన్లకు తరలించారు. అదేవిధంగా మార్కాపురం జిల్లా వ్యాప్తంగా 552 వాహనాలను తనిఖీ చేసి, 133 వాహనాలను స్వాధీనం చేసుకొని సంబంధిత పోలీసు స్టేషన్లకు తరలించారు. నిర్ణీత సమయం దాటి అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు, రాత్రి సమయంలో మరోసారి అనవసరంగా రోడ్లపై తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సంబంధిత వాహనాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై ఈ-చలానాలు విధించారు. నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే దిశగా ప్రతిరోజూ నైట్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తున్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది నుండి ఎస్సైలు, సి.ఐలు, డీఎస్పీలు వరకు రాత్రి వేళ గస్తీ విధులు నిర్వహిస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. బీట్ అధికారులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, రవాణా వివరాలు సేకరించడంతో పాటు కొత్త వ్యక్తుల వివరాలను ఆరా తీసి, అక్రమ కార్యకలాపాలను అరికట్టే చర్యలు చేపడుతున్నారు. బీట్ పాయింట్లను తరచూ తనిఖీ చేస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్కడ ఉండే వారి ఆధార్ వివరాలను పరిశీలించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరస్తులు, చెడునడత కలిగిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టి, మొబైల్ చెక్ డివైసుల ద్వారా తనిఖీ చేస్తున్నారు. దేవాలయాలు, ఎటిఎంలు, ముఖ్య వ్యాపార కేంద్రాల వద్ద పోలీసులు అప్రమత్తంగా గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు.

రాత్రి వేళల్లో అల్లర్లు, గొడవలు, దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, కారణం లేకుండా తిరిగే ఆకతాయిల పై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పై







# ఒంగోలు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో అరుదైన రెండు ఎండోస్కోపిక్ వైద్య విధానాలు విజయవంతం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)**

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, ఒంగోలు లో అరుదైన రెండు ఎండోస్కోపిక్ వైద్య విధానాలను విజయవంతంగా నిర్వహించినట్లు కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శ్రావణ్ తుమాటి మీడియాకు తెలిపారు. 18 సంవత్సరాల యువకుడు తీవ్రమైన ప్యాంక్రియాస్ సమస్యతో పాటు ప్యాంక్రియాస్‌లో గడ్డ (లంప్)తో ఆసుపత్రికి వచ్చినట్లు ఆయన తెలిపారు. రోగి పరిస్థితి శస్త్రచికిత్సకు అనుకూలంగా లేకపోవడంతో, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ యంత్రం సహాయంతో స్టెంట్‌ను అమర్చి, ప్యాంక్రియాస్‌లో ఏర్పడిన ద్రవాన్ని బయటకు పంపించే విధానం చేపట్టామని చెప్పారు. ఈ చికిత్సతో రోగి త్వరగా కోలుకుని కేవలం మూడు రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యాడన్నారు. శస్త్రచికిత్సపై భయం ఉన్నవారికి ఇటువంటి ఆధునిక ఎండోస్కోపిక్ విధానాలు ఎంతో ఉపయోగకరమని ఆయన వివరించారు. అలాగే 70 సంవత్సరాల వయస్సు గల మహిళ చిన్న ప్రేగుల నుంచి నిరంతర రక్తస్రావంతో ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. సాధారణ ఎండోస్కోపీ మరియు కొలొనోస్కోపీ పరీక్షల ద్వారా రక్తస్రావం మూలాన్ని గుర్తించలేకపోయామని చెప్పారు. అనంతరం క్యాప్సూల్ ఎండోస్కోపీ అనే ప్రత్యేక పరీక్షను నిర్వహించామని తెలిపారు. ఈ విధానంలో చిన్న కెమెరా కలిగిన క్యాప్సూల్‌ను శరీరంలోకి పంపించి రక్తస్రావం జరుగుతున్న ప్రాంతాన్ని గుర్తించి, అనంతరం శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా చికిత్స అందించామని పేర్కొన్నారు. ఈ రెండు అత్యాధునిక వైద్య విధానాలు ఒంగోలు యూనిట్‌లో తొలిసారిగా విజయవంతంగా నిర్వహించబడినట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, ఒంగోలు క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నితిన్ నల్లూరి తెలిపారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి రమేష్ బాబు మాట్లాడుతూ ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఒంగోలులో అత్యాధునిక వైద్య పరికరాలు, నైపుణ్యం కలిగిన మెడికల్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ బృందం, శిక్షణ పొందిన అనస్థీషియా, ఐసీయూ సదుపాయాలతో అన్ని రకాల జీర్ణాశయ సంబంధిత సమస్యలకు సమగ్ర వైద్యం అందిస్తున్నామని తెలిపారు.





Printed by O Radhakrishna Dass On behalf of HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Published from Dr.No. 4-255, PANDARIPURAM CHILAKALURIPET H/O, PURUSHOTHA PATNAM CHILAKALURIPET, GUNTUR, ANDHRA PRADESH - 522616. Mobile : 9494177939, RNI : APTEL/25/A2455, E-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com.

# లోపాలు ఉంటే సరిదిద్దుకుందాం ప్రజల సేవకి కలిసి పనిచేద్దాం

**సర్కిల్ స్థాయిలో ఉండే సమస్యల సత్వర పరిష్కారం**
**సమాజ హితం పోలీస్ లక్ష్యం**
**పోలీస్ మీడియా ప్రతినిధుల స్నేహ పూర్వక కలయికలో**
**సిఐ వై శ్రీహరి పిలుపు**

**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, మే 15)**

విధినిర్వహణలో కార్యక్షేత్రంలో ఎక్కడైనా లోపాలు చోటు చేసుకుంటే పోలీస్ పరంగా సరిదిద్దుకుంటామని మీడియా కూడా అదే విధంగా సమన్వయంతో సహకరించాలని సింగరాయకొండ సిఐ వై శ్రీహరి మీడియా ప్రతినిధులకు పిలుపిచ్చారు. శుక్రవారం సాయింత్రం సింగరాయకొండ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సింగరాయకొండ, జరుగుమల్లి ఎస్ఐల మీడియా ప్రతినిధుల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ మీడియాది స్నేహ పూర్వక బంధం అని ప్రజలకు సత్వర న్యాయం రక్షణ కల్పించడం లో సమన్వయంతో పని చేద్దామని కోరారు.విధినిర్వహణ లో అక్కడక్కడ పొరపాట్లు చోటు చేసుకుంటాయని వాటిని సానుకూలంగా అర్థం చేసుకుని సహకరించాలని సి ఐ శ్రీహరి కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రహసనం మొదలయిందని ఇంకా ప్రకటన రావాల్సి ఉంది కనుక ఇప్పటి నుండి శాంతి భద్రతల పరిరక్షణ కోసం కలిసి సేవలు అందించాలనింకోరారు. సర్కిల్ పరిధిలో సింగరాయకొండ, జరుగుమల్లి, టంగుటూరు పోలీస్ స్టేషన్ ల పరిధిలో ప్రజలు పోలీస్ కి సహకరించాలని చెడునడత గల వారి సమాచారం, సంఘ విద్రోహ కార్యక్రమాలు, చెడు వ్యసనాలు,గంజాయి సరఫరా చెలామణి,జూదం, బెట్టింగ్ నేరాల నియంత్రణ, దొంగతనాలు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైన చర్యలు చేపడతామని సి ఐ వివరించారు.గృహ దోపిడీలు,దొంగతనాల నివారణ లో భాగంగా ఎల్ హెచ్ ఎం ఎస్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ యాజమాన్యాల కింద సేవలు అందిస్తున్న వృత్తి జర్నలిస్ట్ లు ప్రత్యేకించి సింగరాయకొండ కేంద్రానికి సంబంధించి పలు సమస్యలను ఆయన దృష్టిలో పెట్టి శాంతి భద్రతలు పరిరక్షణ , రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సి ఐ దృష్టికి తీసుకు వెళ్ళారు. వృత్తి జర్నలిస్ట్ లు తమ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సింగరాయకొండ ఎస్ఐ లేళ్ల సుధీర్ కుమార్, జరుగుమల్లి ఎ పి భాగ్యరాజ్ లను సింగరాయకొండ మీడియా ప్రతినిధులకు పరిచయం చేశారు. అనంతరం వివిధ యాజమాన్యాల కింద సేవలు అందిస్తున్న మీడియా ప్రతినిధులు వ్యక్తిగతంగా వాటిని పరిచయం చేసుకున్నారు.





## కిశోరి వికాసం సమ్మర్ క్యాంపు





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 15)**

మండలంలో మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల నందు మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పెదగంజాం సెక్టార్ సూపర్వైజర్ వాణిశ్రీ అధ్యక్షతన కార్యకర్తలు ఎమ్ రమ, వై గాయిత్రి, డి రేణుక దేవి పర్యవేక్షణలో కిషోరి వికాసం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ వాణిశ్రీ మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల కిషోర బాలబాలికలకు ఆరోగ్యం, సామాజిక అంశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.రక్తహీనత నివారణ, పౌష్టికాహారం పై అవగాహన, బాల్య వివాహాల నిర్మూలన, భద్రత, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వాణిశ్రీ, కార్యకర్తలు ఎమ్ రమ, వై గాయిత్రి, డి రేణుకదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు ఆది ఆంధ్ర కాలనీలో కిషోర్ వికాసం ప్రోగ్రాం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 15)**

మండల పరిధిలోనికి ఆత్మకూరు పంచాయతీ ఆది ఆంధ్ర కాలనీలో డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం కిషోరి వికాసం ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి 11 నుంచి 18 సంవత్సరాల కిషోర్ బాలికలు, కిషోరి బాలురు హాజరయ్యారు. నా అవసరాలు నా సవాళ్లు, లైంగిక పునరుత్పత్తి, హెచ్ఐవి పై అవగాహన గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, పిల్లలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఢిల్లీ తరహాలో రైతు పోరాటాలు నిర్మించాలి

**రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య పిలుపు**



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 15)**

ఢిల్లీ తరహాలో రైతాంగ ఉద్యమాలను నిర్మించాల్సిన తక్షణ కర్తవ్యం మనందరిపై ఉందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా వినుకొండలో శుక్రవారం నిర్వహించిన రైతు సంఘం ద్వితీయ మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమెరికా ఆంక్షలకు తలొగ్గి నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ వ్యవసాయ రంగాన్ని, రైతులను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తోందని ఆయన మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే 17 రకాల చట్టాలను తీసుకురావడం, ఎరువుల ధరలను 20 శాతం పెంచడం ద్వారా రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా ట్రంప్ సర్కార్ భారత ఎగుమతులపై 18 శాతం సుంకం విధిస్తున్నా, మోడీ ప్రభుత్వం మాత్రం అమెరికా నుండి అనవసర యుద్ధ సామాగ్రి కొనుగోలు చేస్తూ దేశ నిధులను కొల్లగొడుతోందని ధ్వజమెత్తారు. రైతు పక్షపాతి అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దుర్మార్గపు చట్టాలను ప్రశ్నించకుండా కేంద్రానికి వత్తాసు పలుకుతూ రైతులకు ద్రోహం చేస్తోందని ఎద్దేవా చేశారు. మరో నేత గద్దె చలమయ్య మాట్లాడుతూ మద్దతు ధర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారులకు మేలు చేస్తున్నాయని ఆరోపించారు. పత్తి, మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, వందల కోట్ల విలువైన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులమతాల పేరుతో రైతులను విడగొడుతున్న పాలకుల వైఖరిని ఎండగడుతూ, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికులు సంఘటితమై భూమి కోసం, గిట్టుబాటు ధరల కోసం ఢిల్లీ తరహా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బి బాలకృష్ణ, నరసింహారావు, విజయ్ కుమార్, ఆంజనేయులు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచితంగా మెడికల్ క్యాంపు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)**

నగరంలోని కమ్మపాలెం నందు గల వృద్ధాశ్రమ నందు వృద్ధులకు శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 30 మంది వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, టానిక్లు పంపిణీ చేశారు. ఎండాకాలం ఎక్కువగా మంచి నీరు, మజ్జిగ తాగడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. ప్రతి నెల ఆశ్రమంలో ఇలాగే ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపకులు ఎన్ ఎం సుభాని తెలియజేశారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృపాసత్యం మాట్లాడుతూ ఇంకా ఎవరైనా స్థానిక దాతలు ముందుకు వస్తే అబ్దుల్ కలాం సేవా సంస్థ ద్వారా అవసరమైన ప్రాంతాల్లోని ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేయగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురవారెడ్డి, లైబ్రేరియన్ సంపూర్ణ, ఆంటోనీ, భాష, కృపసత్యం, తదితరులు పాల్గొన్నారు.

## జలధార – జలహారతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుందాం

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 15)**

జలధార–జలహారతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బోడపాడు గ్రామంలో జలధార – జలహారతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడపాడు చెరువును పూడిక తీయించడానికి పొక్లైనర్ను స్వయంగా నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ జలధార జలహారతి కార్యక్రమం ఎంతో మంచి కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు గ్రామస్తులు కూడా ఈ కార్యక్రమానికి తమ వంతు సాయం చేసి గ్రామ చెరువును పూడిక తీయించడానికి సహాయం చేయాలని సూచించారు. మునునెన్నడు లేని విధంగా 40 సంవత్సరాల తరువాత బోడపాడు చెరువును నీటితో నింపామన్నారు. తద్వారా ఈ ప్రాంతంలోని బోర్లు రీఛార్జ్ అయ్యి వచ్చే రెండేళ్లు నీటి సమస్య లేకుండా ఉంటుందన్నారు. ఇటీవల మార్కాపురం ప్రత్యేక జిల్లాతో ఈ ప్రాంతంలో భూముల రేట్లు పెరిగాయని, తద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇతర అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.








## సీతానాగులవరంలో శ్రీ వీరాంజనేయ స్వామి జయంతి



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 15)**

తర్లుపాడు మండలం సీతానాగులవరం గ్రామం లో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి జయంతి సందర్భంగా స్వామివారిని వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బుచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, యువనాయకులు అన్నా కృష్ణ చైతన్యలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, సీతానాగులవరం మాజీ సర్పంచ్ తాటికొండ ఆంజనేయులు, తాటికొండ దాసయ్య, రేగుల అంకయ్య, మురారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.